క్లుప్తంగా

ఆర్టీసీలో మహాలక్ష్మి సంబురాలు



ప్రయాణికురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, డీఎం

భద్రాచలంఅర్బన్: ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ పథకం విజయవంతంగా అమలు చేస్తున్న సందర్భంగా బుధవారం భద్రాచలం బస్టాండ్‌లో సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంలో ప్రభుత్వమే నేరుగా మహిళల ఉచిత ప్రయాణ చార్జీలను సంస్థకు చెల్లిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీ, చిత్ర లేఖనం, రంగవల్లి కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థినులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. అదే విధంగా రోజువారీ ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేస్తున్న మహిళా ప్రయాణికులను సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్లు గౌతమి, శ్రీనివాస్, స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వర్‌రావు, భద్రాచలం మహిళా సంఘ అధ్యక్షురాలు ద్రాక్షాయిణి, ఆర్టీసీ వెల్ఫేర్ బోర్డు మెంబర్లు కవిత, భద్రం, మహిళా సంఘ సభ్యులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డలు క్షేమం


108 వాహనంలో శిశువును బంధువులకు అందిస్తున్న ఈఎంటీ సుభద్ర

బూర్గంపాడు: ములకలపల్లి మండలం చింతలపాడు గ్రామానికి చెందిన గర్భిణి రాజేశ్వరికి బుధవారం పురిటినొప్పులు రావటంతో 108 వాహనంలో భద్రాచలం తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో నొప్పులు ఎక్కువ కావటంతో ఈఎంటీ సుభద్ర 108 వాహనంలో ప్రసవం చేయించింది. నాలుగవ కాన్పులో రాజేశ్వరి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అయిన వెంటనే తల్లి, బిడ్డను బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారిని పరీక్షించిన వైద్యులు ఇద్దరు క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. సమయస్ఫూర్తితో వ్యవహరించిన 108 వాహన పైలట్ విజయ భాస్కర్‌ను, ఈఎంటీ సుభద్రను వైద్యులు అభినందించారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

మణుగూరురూరల్: భారీ వర్షాల పట్ల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు బుధవారం సోషల్ మీడియా వేదికగా సూచించారు. వాగులు, వంకలు పొంగి ఇళ్లల్లోకి వరద నీరు చేరే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని అన్నారు. వరద ముంపుకు గురికాకముందే ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని ఆయన సూచించారు.

వైభవంగా బోనాల ఉత్సవాలు


ముత్యాలమ్మ తల్లికి భక్తులు సమర్పించిన సారె..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊట్లపల్లి గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ తల్లి, గ్రామ దేవత ఆలయాల్లో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్ల వద్ద నుంచి మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో బోనాలను తలపై పెట్టుకొని ఊరేగింపుగా ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్దకు తరలివచ్చారు. అనంతరం ఆలయంలో బోనాలతో ప్రదక్షిణలు చేసి, వాటిని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముత్యాలమ్మ తల్లిను ప్రత్యేకంగా అలంకరించి, అమ్మవారికి సారె, వివిధ రకాల స్వీట్లు, పండ్లతో నైవేద్యాలు సమర్పించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, మహిళల నృత్యాలతో ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు.

సర్కారు ఆస్పత్రికి ఆదరణ

- పెరుగుతున్న ఓపీల సంఖ్య
- సాధారణ ప్రసవాలూ అధికమే..
- పనితీరుపై కలెక్టర్, ఎమ్మెల్యే సంతృప్తి



మణుగూరులోని 100 పడకల ఆస్పత్రి..

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గంలోని మండల కేంద్రంగా ఉన్న మణుగూరులోని 100 పడకల ఆస్పత్రిలో పూర్తి స్థాయి వైద్య సేవలు అందుతున్నాయి. రోగుల సంఖ్య క్రమంగా పెరుగడమే ఇందుకు నిదర్శనం. సుదూర ప్రాంతాలకు చెందిన ఆదివాసీలతో పాటు సమీప గ్రామాల ప్రజలు అధికంగా ఇక్కడి సేవలు వినియోగించుకుంటున్నారు. ఇటీవల ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ క్షేత్రస్థాయిలో ఆస్పత్రిని సందర్శించి వచ్చే రోగులతో మాట్లాడారు. సంతృప్తి వ్యక్తం చేస్తూ వైద్యుల సేవలను అభినందించారు.

పెరిగిన కాన్పుల సంఖ్య..

100 పడకల ఆస్పత్రిలో గతంలో నెలకి 8–10 ప్రసవాలు జరిగితే.. మే నెలలో ఆ సంఖ్య 68కి చేరింది. జనవరి నుంచి జూన్ నెలాఖరు వరకు 237 ప్రసవాలు కాగా అందులో అధికంగా సాధారణ ప్రసవాలు ఉండటం గమనార్హం. ప్రైవేట్ ఆస్పత్రులను పోలిస్తే ప్రభుత్వ ఆస్పత్రిలో సిజేరియన్ల సంఖ్య తగ్గి సాధారణ ప్రసవాల సంఖ్య పెరుగుతుండటంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో వేలకు వేలు ఖర్చు పెట్టి సిజేరియన్ చేయించుకునేందుకు ప్రజలు విముఖత చూపుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి సేవలను సద్వినియోగం చేసుకునేందుకు వారు ముందుకు వస్తున్నారు.

స్పెషలిస్ట్ వైద్యుల రాకతో..

గతంలో స్పెషలిస్ట్ వైద్యుల కొరతతో తీవ్రంగా ఉండి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ రవిబాబు, డీసీహెచ్‌ఎస్ రవిబాబుల చొరవతో స్పెషలిస్ట్ వైద్యుల కొరత తీరింది. ఇద్దరు ప్రసూతి వైద్యులు, అనస్తీషియా, పీడియాట్రీషియన్, రేడియాలజిస్ట్, డెంటల్, ఐదుగురు ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులో వచ్చారు. దీంతో ఓపీ సంఖ్య పెరగడంతో పాటు భద్రాచలం వంటి ప్రాంతాలకు రిఫరీలు తగ్గించి మెరుగైన వైద్య సేవలు ఇక్కడే అందిస్తున్నారు.

సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత



గర్భిణుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇస్తున్నాం. తప్పని పరిస్థితుల్లో సిజేరియన్లు చేస్తున్నాం. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సీజేరియన్లు ఎక్కువగా జరుగుతుండటంతో ఆదివాసులు, ప్రజలు 100 పడకల ఆస్పత్రికి రావడం శుభ సూచకం. అన్ని రకాల రోగాలకు ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉన్నారు.

– సూపరింటెండెంట్ సునీల్

పోడుభూముల జోలికి వెళ్లొద్దు

- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
- ముంపు ప్రాంతాల్లో పర్యటన


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: ఏళ్లతరబడి పోడు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆదివాసీ రైతుల పోడు భూముల జోలికి వెళ్లొద్దని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఫారెస్ట్ అధికారులకు సూచించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన ఆళ్లపల్లి, గుండాల ఫారెస్ట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. ఎవరైతే కొత్తగా పోడు కోసం అడవులను నరికితే వారిపై చర్యలు తీసుకోవాలని, ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న వారిని ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. సమావేశంలో ఇల్లెందు ఎఫ్‌డీఓ కరుణాకర్‌చారి, ఆళ్లపల్లి, గుండాల మండలాల ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ అధికారులతో సమీక్ష..

పినపాక నియోజకవర్గంలోని మండలాల్లో ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అధికారులు అలసత్వం వహించొద్దని ఎమ్మెల్యే పాయం సూచించారు. క్యాంప్ కార్యాలయంలో ఐటీడీఏ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఈఈ హరీష్, డీఈ మధుకర్, ఏఈ ప్రభాకర్, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటన

మణుగూరుటౌన్: వరద ముంపుకు గురైన గ్రామాలను, వీధులను బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మండల నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. తొలుత సింగరేణి డంప్‌యార్డ్‌ల మీదుగా వచ్చిన వరద వల్ల కోతకు గురైన కాల్వను పరిశీలించారు. అనంతరం పెద్ద బ్రిడ్జి, గాంధీనగర్, వినాయకనగర్, సుందరయ్యనగర్ తదితర గ్రామాలను సందర్శించి వాగుల మీదుగా వరద ఉధృతిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కట్టు వాగు, మొట్టు వాగు పూడికతీత పనులు వేగంగా చేపట్టినందున ముంపు ముప్పు తప్పిందన్నారు. రానున్న రోజుల్లో సింగరేణి డంపింగ్ యార్డ్ నుంచి వస్తున్న నీటి ప్రవాహాలను నివాస ప్రాంతాలకు రాకుండా శాశ్వత పరిష్కారం కోసం సింగరేణి అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, మండల అధ్యక్షుడు నవీన్, శివ, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, నాయకులు కూచిపూడిబాబు, గణేశ్‌రెడ్డి, అబ్దుల్లా, గోరంట్ల కనకయ్య, గాండ్ల సురేశ్, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విస్తృత పర్యటన


ముష్టిబండ పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

దమ్మపేట: మండల పరిధిలోని ముష్టిబండ, వడ్లగూడెం గ్రామాల్లో పర్యటించిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముష్టిబండ, వడ్లగూడెం గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ముష్టిబండ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, పాఠశాలలో నెలకొనియున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలను త్వరలోనే పరిష్కారిస్తానని తెలిపారు. అంతకుముందుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పసుపులేటి వీరబాబు, మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జారేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. జిల్లా పరిధిలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, కాంగ్రెస్ నాయకులు రావు గంగాధర రావు, బుద్ధా రాజు, వాసం శ్రీను, రవిశంకర్, ముళ్లపూడి వెంకటేశ్వరరావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

‘ఎన్‌సీసీ’లో సత్తాచాటిన విద్యార్థినులు



బంగారు పతకాలను అందుకున్న డిగ్రీ కళాశాల విద్యార్థినులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెదవాగు ప్రాజెక్టు గ్రామంలోని(దమ్మపేట) ప్రభుత్వ గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎన్‌సీసీ శిక్షణా శిబిరంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో సత్తాచాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.స్పందన తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె మాట్లాడుతూ.. ఖమ్మం 11టీ బెటాలియన్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి 22వ తేదీ వరకు వరంగల్ జిల్లాలోని మామునూరులో ఎన్‌సీసీ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించగా.. విద్యార్థినులకు ఎన్‌సీసీ శిక్షణలో భాగంగా ఫైరింగ్ కోచింగ్ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణకు హాజరైన విద్యార్థినులకు ముగింపు సందర్భంగా పలు క్రీడా పోటీలను నిర్వహించగా.. డిగ్రీ కళాశాలకు చెందిన 10 మంది విద్యార్థినులు ఆరు బంగారు, రెండు వెండి, ఒక రజిత పథకాలను కైవసం చేసుకుని ప్రతిభకనబరిచినట్లు వివరించారు. ఆయా బహుమతులు, జ్ఞాపికలను బెటాలియన్ కమాండెంట్ కల్నల్ సంజయ్ భద్ర, కల్నల్ నవీన్ యాదవ్ చేతుల మీదుగా అందుకున్నట్లు చెప్పారు. బహుమతులు సాధించడం పట్ల ప్రిన్సిపాల్‌తోపాటు, బోధన, బోధనేతర, తోటి విద్యార్థులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

జోరు వానలోనూ జలపుష్పాల వేట


చేపల వేటలో యువకులు

కరకగూడెం: ఒకవైపు భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ యువత మాత్రం వాటిని లెక్కచేయకుండా ‘జలపుష్పాల’వేటలో నిమగ్నమవుతున్నారు. పొంగిపొర్లుతున్న వాగులు, నిండిన చెరువుల్లో చేపలు పట్టడానికి ఉత్సాహంగా బయలుదేరుతున్నారు. తాటిగూడెం–గాంధీనగర్ గ్రామాల మధ్యలో ఉన్న ఓ చెరువు అలుగు వద్ద బుధవారం ఇలాంటి దృశ్యమే కనిపించింది. అలుగు వరద పొలాల్లోకి వెళ్తుండగా అక్కడ వల సాయంతో ఇద్దరు యువకులు ‘చేపలు’పడుతున్నారు.

సామాన్యులకు అండగా కాంగ్రెస్


వీరబాబును సన్మానిస్తున్న పొదెం వీరయ్య

భద్రాచలంటౌన్: కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పనిచేసే ప్రతి కార్యకర్తతో పాటు సామాన్యులకు అండగా ఉంటుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్రఅటవీ శాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పొదెం వీరయ్యను జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని పొదెం సూచించారు. వీరబాబును శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

నత్తనడకన రహదారి విస్తరణ పనులు


మండల కేంద్రంలో అసంపూర్తిగా మిగిలిపోయిన రహదారి విస్తరణ పనులు..

అశ్వాపురం: మండల కేంద్రంలో ప్రధాన రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రహదారి విస్తరణ పనులు ప్రారంభించి ఆరునెలలు గడిచినా పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. నత్తనడకన సాగుతున్న పనుల వల్ల వాహనదారులు, మండల కేంద్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రెండు ఏండ్ల క్రితం రూ.4 కోట్లతో రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ, ప్రధాన రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ శంకుస్థాపన చేశారు. డ్రెయినేజీ పనులు పూర్తయ్యాయి. రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ ఏడాది జనవరిలో రహదారి విస్తరణ పనులు ప్రారంభించారు. రహదారికి ఇరువైపులా రహదారిని విస్తరించి డివైడర్ల నిర్మాణం పూర్తి చేశారు. ఇరువైపులా విస్తరించిన రహదారికి తారు రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులు చేయాల్సి ఉంది. రహదారి రహదారి విస్తరించి రెండు నెలలుగా అసంపూర్తిగా వదిలేయడంతో వర్షాలకు మండల కేంద్రంలోని దుకాణదారులు, ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

మంత్రిని కలిసిన గ్రంథాలయ చైర్మన్

దమ్మపేట: ఇటీవల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పసుపులేటి వీరబాబు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని గండుగులపల్లి నివాసంలో మంత్రిని కలవగా ఆయనను తుమ్మల సత్కరించి గ్రంథాలయాల అభివృద్ధిపై సూచనలు చేశారు. అలాగే, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ నర్సింహ కూడా మంత్రిని కలిశారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ చైర్మన్ వాసం రాణి, నాయకులు కొయ్యల అచ్యుతరావు, పైడి వెంకటేశ్వరరావు, కాసాని నాగప్రసాద్, వాసం శ్రీను, మన్నెం అప్పారావు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సీహెచ్ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో బుధవారం మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా తాము పోలీసులమని, ప్రభుత్వ అధికారులమని చెప్పి డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

పోస్టర్లు ఆవిష్కరణ


ములకలపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైశ్య వేదిక కమిటీ బాధ్యులు

ములకలపల్లి: వైశ్య రాజకీయ రణభేరి సభను విజయవంతం చేయాలని వైశ్య వేదిక కమిటీ చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్త పిలుపునిచ్చారు. ములకలపల్లిలో బుధవారం రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగష్టు 3వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే సభకు ఆర్యవైశ్యులు భారీగా తరలిరావాలని కోరారు. జిల్లా నాయకులు కొదుమూరి దయాకర్, సంఘ మండల అధ్యక్షుడు అత్యం రాంబాబు, బిక్కుమళ్ల సుధాకర్, పద్దం నర్సింహారావు, అద్దంకి రమేశ్, ఓబులశెట్టి ప్రభాకర్, పుల్లూరు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి వెంకటమ్మకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.40వేల విలువ గల చెక్కును పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు శివసైదులు, యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, నీలకంఠేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కూచిపూడిబాబు, నాయకులు గణేష్‌రెడ్డి, రామిరెడ్డి, గాండ్ల సురేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించండి

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని మండల ప్రజలకు ఎంపీడీఓ కావూరి మహాలక్ష్మి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలను ఆమె సిబ్బందితో కలిసి బుధవారం తొలగించారు. వర్షాలు పడుతున్న తరుణంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఎస్‌కె.షబాన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం..

గుండాల: ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో బుధవారం తెల్ల వారు జాము నుంచి కుండపోతగా వర్షం కురుస్తోంది. దీంతో మండలంలోని వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లోని గత రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో కిన్నెరసాని జల్లేరు ఏడుమెళికల వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో చుట్టుపక్క గ్రామాల రాకపోకలు నిలిచిపోయాయి. ముఖ్యంగా గుండాల కొడవటంచ వద్ద లో లెవెల్ బ్రిడ్జి పైనుంచి వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో నాగారం, కొడవటంచ, దొంగతోగు, పాలగూడెం గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఆళ్లపల్లి మండలంలో కిన్నెరసాని, జల్లేరు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అడవిరామారం, సీతా నగర్ రాయి గూడెం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

ఆళ్లపల్లి కొత్తగూడెం మధ్య లో లెవెల్ బ్రిడ్జిపై వాగు ఉధృతంగా ప్రవహించడంతో బస్సులు సైతం ఆగిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆయా మండలాల్లో చెరువుల్లో కుంటల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది. అక్కడక్కడ చెరువులు అలుగులు పోస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయ్య మయ్యాయి పలుచోట్ల రోడ్లపైకి నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

సహాయక చర్యలకు సంసిద్ధంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరురూరల్: బంగాళఖాతం అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు వరదలు సంభవించే అవకాశం ఉందని, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో తక్షణ సహాయక చర్యల్లో డీడీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సంసిద్ధంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ అద్దంకి నరేష్‌లు సూచించారు. బుధవారం వరద సహాయక చర్యలపై వారు పోలీస్, రెవెన్యూ, డీఆర్‌ఎఫ్ బృందాలతో ప్రత్యేక సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. జిల్లాలోనే కాకుండా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరితో పాటు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, గోదావరి తీర ప్రాంతాల్లోని ప్రజలు వరద ముంపుకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు. వారిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏ క్షణమైనా తక్షణ సహాయక చర్యలు అందించేందుకు డీఆర్‌ఎఫ్ బృందాలు కీలకంగా సేవలందించాలన్నారు. రెస్క్యూ బోట్స్, లైఫ్ జాకెట్స్ వంటివి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో మణుగూరు ఎంపీడీఓ తేళ్లూరి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, సీఐ పాటి నాగబాబు, ఎస్సైలు రంజిత్, ట్రైనీ ఎస్సై మనీషా, పోలీస్, డీడీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

ములకలపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు భోగి కృష్ణ, బాల వెంకట రెడ్డి పిలుపునిచ్చారు. మండలపరిధిలోని మాధారం గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు శంకర్ నాయక్ అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అత్యధిక స్థానాలు గెలుపొందడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. మండల కన్వీనర్ ఊకంటి మధుసూధన్, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు అనుమల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శులు పూనెం నవీన్‌కుమార్, అత్యం సాయి. తంగెళ్ల అంజనేయులు, పాలకుర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ.. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతో పాటు కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు చేసే ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగా సమస్యలపై దృష్టి సారించాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్


భద్రాచలంటౌన్: ప్రభుత్వ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



దమ్మపేట: పాఠశాలను బంద్ చేయించి విద్యార్థులను బయటకు పంపిస్తున్న నాయకులు


గుండాల: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మాట్లాడుతున్న నాయకులు


అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంకు బంద్ చేయాలని వినతి చేస్తూ..



ములకలపల్లి: జూనియర్ కాలేజీ వద్ద విద్యార్థి సంఘాల నాయకులు